# శ్రీ రమణ జ్యోతి

# Sri Ramana Jyothi

మార్చి 2019

March 2019

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 57వ ప్రవచనం | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | బ్రహ్మకమలం; చిత్ సరస్వతి | ముదిగొండ వీరభద్రయ్య | 11 |
| 3. | శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి | 12 |
| 4 | నమ్మకం - విశ్వాసం | డా. వి. రామదాస్ మూర్తి | 17 |
| 5. | గురురూప సందర్శనము | దోనెపూడి వెంకయ్య | 20 |
| 6. | హృదయం, మనసు | శ్రీవత్సస | 22 |
| 7. | రమణస్తుతి | గాలి సుబ్బలక్ష్మి, వేమూరి విజయశ్రీ | 28 |
| 8. | Gems From Adi Sankara's Bhaja Govindam | Dr.K.Subrahmanian | 30 |
| 9. | The Secret of Guru | K. Lakshmana Sarma | 34 |
| 10. | Saints of Periapuranam Tiru Neelakanta Nayanar | | 36 |
| 11. | Sri Bhagavan, the Pinnacle of Samavatva Bhava | G. Sri Hari Rao | 39 |
| 12. | Singing the Glory of Sri Ramana Kavyakantha's Sri Ramana Chatvaarimsat | | 40 |
| 13. | Kili Gopuram (Parrot Tower) | Sneha Choudhury | 44 |
| 14. | Unforgettable Years | Manavasi Ramaswami Iyer | 49 |


## Events in Sri Ramana Kendram in March

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 16th March - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.


శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)


# అహంకార నాశమే ఏకాంతం


ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 57వ ప్రవచనం

తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ


సిరి సంపదలు, లోకజ్ఞానం, అధికారం హోదాలు వీటి నుండి మనకు సుఖం కావాలని తాపత్రయపడతాము. కొంతకాలం తర్వాత, మనం ఇతరుల కన్నా కొన్ని విషయాలలో సుఖంగా ఉన్నామని గుర్తించినా, ఇతరుల కంటే ఎక్కువ ఆనందంగా సుఖంగా లేమని గ్రహిస్తాము. కొందరు పూజ జపాదులు చేస్తే ఆనందం కల్గుతుందంటారు. లేదా కొడుకులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు వీరందరూ సంతోషాన్నిస్తారంటారు. కర్మలు, ఇంకా ఏవేవో చేస్తే సంతోషం కల్గుతుందంటారు. ఎవరో చెప్పిన సలహాలను పాటించిన పిదప కూడ ఆనందం లేదని పిస్తుంది. ప్రవచనాలను వింటాము. గ్రంథాలు చదువుతాము. అయినా తృప్తి లేదు. ఎందుకు?

ఆనందంగా, సంతోషంగా వున్నవారి ఆ రహస్యం ఏమిటి? ఆ రహస్యం చెప్పరు. మనం సంతోషంగా ఉన్నామని ఇతరులతో చెప్పము. పంచుకోలేము కూడా. ఎన్ని ఉన్నా సంతోషం మాత్రం కరువు. "మీకేమిటండీ, చాలా ధనం ఉంది" అనినపుడు సంతోషంగానే వుంటుంది. కాని మనకంటె డబ్బున్నవారితో మనలను పోల్చుకొంటాము. బాధ కల్గతుంది. అపుడు ఇంకా సంపాదించాలనే కోరిక మనలో కలుగుతుంది. దాని కోసం పడరాని పాట్లు పడతాము. ఇంతకీ, ఎందుకని ఈ సంపాదన?

ఆ ధనం మనకు అవసరమా? కొంతవరకు అవసరమే. ఆ దశ దాటితే డబ్బు యొక్క అవసరం ఏముంటుంది? సంపాదిస్తూ చివరకు ఎంతో ధనవంతుడు, భాగ్యశాలి అనిపించుకొంటాము. ప్రపంచంలో అందరికంటే అత్యధిక సంపన్నుడని అనిపించు కోవాలా? ఇవన్నీ వ్యక్తి యొక్క అహకారాన్ని బలపరుస్తాయి. మరొకరితో చెప్పుకోడానికి పనికొస్తాయి. ఏదో విధంగా ఇలాగ గొప్పలు చెప్పుకుని తృప్తి చెందుతారు.

అట్లాగే ఆధ్యాత్మిక విషయాలలో కూడ వేదాల గురించి, ఉపనిషత్తుల గురించి, లేదా శంకరుల గురించి తెలిసినట్లు చెప్పు కుంటాము. ఈ విద్యలు కూడా మన అహంకారాన్ని పెంచుతాయి. ఈ సమాజంలో నాకంటూ ఒక గుర్తింపును పొందాలి అనే ఆకాంక్ష. ప్రతి ఒక్కరూ కోరుకొనేది గుర్తింపు. తద్వారా సంతోషం, ఆనందం, పొందాలనుకొంటాము. మనం జాగ్రత్తగా లేకపోతే పొగడ్తలకు లొంగిపోతాము. మనస్సుకు ఇటువంటివి ఎన్నో కావాలి, చివరకు మనస్సంటే ఏమిటని తెలుసుకొనే వరకు, పొగడ్తలు, తెగడ్తలు రెండూ అహంకారాన్ని ప్రభావితం చేస్తాయి. కాని మనస్సును మనస్సుతో అర్థం చేసుకోలేము. మేజాపై నిలబడి మేజాను ఎత్తాలనుకోవటం వంటిది అది. మేజా నుండి దిగి ఎత్తాలే గాని దానిపై నిలబడి ఎత్తటానికి ప్రయత్నించడము తెలివి తక్కువ పని. మనస్సు కతీతంగా వెళ్లితే గాని అర్థం కాదు. మనస్సయితే తను లేకపోవడాన్ని హర్షించదు. దేనినో పట్టుకొని ఉండాలనుకొంటుంది. ఏదో కొద్దిమందే మనోతీతులయ్యారు.



ఆనందాన్ని అనుభవించిన వారయ్యారు. మనపై ఎంతో కరుణతో, ఆ విషయం చాలా ముఖ్యమని మనకు తెల్పారు. ఇలా ప్రయత్నించండని చెప్పడంలో వారికి ఎటువంటి ఉద్దేశముగాని, స్వార్థంగాని లేదు. శంకరులు సంతోషంగా హిమాలయాలకి వెళ్లి అక్కడ వుండి వుండొచ్చు. భగవాన్ జ్ఞాని అయిన తర్వాత హాయిగా ఎవ్వరికీ ఏమీ చెప్పకుండా జీవించి ఉండవచ్చును. శ్రీరామకృష్ణ పరమహంస, జిడ్డు కృష్ణమూర్తి వంటి మహాత్ములు మాట్లాడకుండా, దేశాలు తిరగకుండా ఉండి వుండవచ్చును. కాని వారందరు మనకు బోధించారు. మనకు చెప్పాలనే సంకల్పం ఎందుకు? కారణం వారనుభవించిన ఆనందాన్ని మనతో పంచు కోవాలని కనికరంతో చెప్పారు. ఇతరులతో మనం ఏదైనా పంచు కొంటే, లేదా కావలసినది ఏదైనా కొని ఇస్తే పంచుకొన్నవారు సంతోషపడతారు. ఇతరులు సంతోషిస్తే మనమూ సంతోష పడతాము. అంటే ప్రేమ ఎక్కడుందో సంతోషమూ అక్కడే వుంది. ఇది సాధారణంగా మనకు తెలిసిన వారికే పరిమితం చేస్తాము. ఆ వలయం దాటితే మనము ఇతరులకు ప్రేమ చూపించలేము. కారణం మన మనస్సు దానికి అంగీకరించడం లేదు. కాని నిరహంకార స్థితిలో వున్నవారు అంటే అహంకార మమకారాలు లేనివారు చాలా అరుదు. ఇట్టివారు ఎట్టి పొగడ్తలకు, తెగడ్తలకు ప్రభావితులవ్వరు. వారిలో ఉన్నదంతా ఒక్క ప్రేమ మాత్రమే. అందు రాగద్వేషాలు ఏమీ లేవు. ఎవరయినా నిందించినా వారిని ప్రేమతోనే చూస్తారు. జ్ఞానులు, యోగులు, ఋషులు వీరందరు

ఇతరులను అన్యంగా చూడరు. అందరూ తన వారే. తాము అందరికీ చెందినవారనే అభేద దృష్టితో వుంటారు:

ఉదారచరితానామ్ తు వసుదైవ కుటుంబకమ్.

మహాభారతంలో ఒక విషయం చెప్పారు. ఒక గొప్ప వ్యక్తికి, ఒక సామాన్య వ్యక్తికి తేడా ఏమిటి? "అహం". సామాన్య వ్యక్తికి నేను, నాది అనే అహంకారం వుంటుంది. కాని మహాత్ములయిన జ్ఞానులు, యోగులు, ఋషులు - ఉదార చరితానామ్, వారికి సొంతం ఏది అని ఆలోచించరు. యావత్ప్రపంచమ్ వారి కుటుంబము; "వసుదైవ కుటుంబకమ్". ప్రతి వ్యక్తికి ఇందు స్థలమున్నది. మహాత్ములు లోకం నుండి ఎట్టి సుఖాన్ని ఆశించరు. వారు ఆత్మారాములు. ఎవరు తనలో ఆనందాన్ని కనుగొంటారో వారు ఆనందాన్ని బయట వెదుకరు. కారణం "సర్వమూ ఉన్నదంతా తనలోనే ఉన్నది" అనే భావన వారిలో కనబడుతుంది. వారంటారు బయట నుండి లభించే ఆనందం తాత్కాలికం. అది వస్తుంది, పోతుంది. కనుక శాశ్వతం కాదు. మనకు వేరుగా వున్న వన్నీ తప్పక మార్పు చెందేవే. అవి శాశ్వతం కాదు. మంచిమిత్రులు విరోధులవుతారు. ఒక్కొక్క తడవ భార్యాభర్తల సంబంధం విడాకులతో ముగుస్తుంది. వీటి అన్నిటికీ కారణం మనస్సే. మనకు కావలసింది ఈ రోజు లభ్యమవుతుంది. రేపు ఇంకొకటి క్రొత్తది కావాలంటుంది మనస్సు. మనస్సు ఎప్పుడూ ఏదో క్రొత్తది కావా లంటుంది, అది ఆధ్యాత్మక విషయాలలోనైన సరే. భౌతిక మయినా సరే. అందుకనే నా ఆధ్యాత్మిక మార్గంలో పురోగతి



కానరావటం లేదంటారు. లేదా నాకు రావలసిన పైకం రాలేదని ఆలోచిస్తాము. అంటే మనస్సు వాంఛించినది రావటం లేదు, మనస్సుకు అసంతృప్తి. మనస్సు యొక్క కోరికలకు అంతే లేదు. కొన్నాళ్లకు అసంతృప్తితో, నిరుత్సాహంతో అలసిపోతాము. దీనికి అంతే లేదా? దీని నుండి బయటపడే మార్గమే లేదా?

"ఆహా! మార్గముంది" అన్నారు మన పూర్వీకులు. నిత్యమూ నేను రెండు గంటలు పూజ చేస్తానంటారు ఒకరు. అది విన్నవాళ్లు "చాలా సంతోషం" అంటారు. అతను గంటలకొలదీ చేసే పూజను అట్లాగే కొనసాగిస్తాడు. పూజను ఆపివేశాను అని అంటే ఇతరులు ఏమనుకొంటారో అన్న సంకోచం, భయమూ, సమాజంలో అతనికి వున్న పేరు పోకూడదు. కనుక అతనికి ఇష్టమున్నా లేకపోయినా కొనసాగిస్తాననుకొంటాడు. ఈ వ్యవహారంలో ఒక విషయం మరచి పోతున్నాము. "పూజనా? జపమా? ధ్యానమా? ఏది ముఖ్యం? అవన్నీ ఒక గమ్యానికి మార్గాలే. అదే ధ్యేయం, గమ్యం కాదు. శంకరులు, రమణులు బోధించింది ఒక్కటే - అసలు ఈ "పూజ జపాదులు చేసే వారెవరో?" కనుక్కోండి అన్నారు. ఈ విచారణ జరిగితే అలాంటివి ఒక దినచర్యగా వుండవు. కారణం పూజ, జప, ధ్యానం నిత్యమూ ఆచరించినట్లయితే ఎన్నో కలుగవచ్చు. ముఖ్యంగా సిద్ధులు కలుగవచ్చును. ఇక్కడే ప్రతి ఒక్కరు ఎంతో జాగరూకతతో ఉండాలి. ఆ సిద్ధులు ఎందుకు కలుగుతాయో కారణాలు మనకు తెలియవు. వీటివలన అట్టివారిపై ఎంతో గౌరవముంటుంది. కాని మీ గురించే మీకు ఒక దురభిప్రాయం

కలుగవచ్చు. అసలు విషయం ఏమిటో దానిని గ్రహించలేక, పేరు ప్రతిష్టలలో మునిగిపోతారు. దానివలన శాశ్వతానందం లభిస్తుందా? లభించదు. వ్యక్తి తన జ్ఞానం గురించి గర్వపడితే అది అతని పురోగతికి అడ్డంకి. అహంకారాన్ని బలపరుస్తాయి. కనుకనే జాగ్రత్తగా వుండాలంటారు భగవాన్. ఎన్ని చదివినా, చివరకు మనకు ఏమీ తెలియదన్న గట్టి అభిప్రాయం ఏర్పడాలి. ఇది కేవలం భగవంతుని అనుగ్రహం వలనే కల్గుతుంది.

ఆత్మజ్ఞానం ముందు మనం సంపాదించిన లోక జ్ఞానం ఎంత? ఆత్మజ్ఞానం చాలా ముఖ్యం. వేరేవి ఏవీ ఆత్మజ్ఞానానికి దారి చూప లేవు. బాహ్యంలో నేర్చుకొన్నవన్నీ అహంకారాన్ని పెంచుతాయి. అందువలనే "త్యాగేనైకే అమృతత్వమానశుః" అన్నారు. ఆనందానికి మరొక మార్గం లేదు.

త్యాగం అంటే అహంకారాన్ని త్యాగం చేయడం అని భావం. అహంకారం పోయిన క్షణమే ఒకడు మంచికి ప్రతిరూపము అవుతాడు. కనుకనే శ్రీరామచంద్రుని వర్ణిస్తూ:

రామో విగ్రహవాన్ ధర్మః ।

అని అన్నది మనకు తెలుసు. శ్రీరాముడెవరు? అతడు ధర్మానికి ప్రతిరూపము. ఆయన జీవితం గురించి చెప్పడం ఎంతో కష్టం. కారణం అతడు ఎన్నో గొప్ప కార్యాలు చేస్తున్నా ఎట్టి ఆలోచనలు లేక తన ధర్మాన్ని పాటించిన ఒక అవతార పురుషుడు. సమస్త సద్గుణములు కలసి రూపొందిన ఒక విగ్రహం. అతడే భగవాన్ శ్రీరామచంద్రుడు.



భగవాన్ అన్నారు, మనం దేనినో వెదకుతుంటాము. ఆ వెదకేది ఎవరు? అని విచారణ చేస్తే "వెదకడం" ఆగిపోతుంది అని. అప్పుడు ఆనందం మాత్రమే మిగులుతుంది. అంతే కాదు:

శ్లో॥ రాగద్వేషవిముక్తైస్తు విసయానింద్రియైశ్చరన్ । (భ.గీ.2.64)

శ్లో॥ దుఃఖేష్యను ద్విగ్నమనాః<br>
సుఖేషు విగతస్పృహః ।<br>
వీతరాగ భయ క్రోధః<br>
స్థిత ధీ ర్మని రుచ్చ్యతే ॥ (భ.గీ. 2.56)

(రాగద్వేషాలను వదిలి ఆత్మ వశమైన ఇంద్రియాలతో, దుఃఖాలు ఏర్పడినప్పుడు కలతచెందని మనస్సు కలిగి, సుఖముల పట్ల ప్రీతి లేక, రాగము, భయము, క్రోధము లేని మునీశ్వరుడు స్థిథప్రజ్ఞుడనబడును).

ఆ ఆనందం ఎలాంటిదంటే (సుషుప్తి) గాఢ నిద్రలో ఉన్న వ్యక్తి మర్నాడు మేల్కొన్న తరువాత ఎంతో ఆనందంగా వుంటుం దన్నట్లు. మనస్సు లేని వానికి మెలకువలో కూడా సుషుప్తిలో వున్న అనుభవం కలుగుతుందని భగవాన్ చెప్పేవారు. అంటే ఎవరయితే ఆనందం కోసం వెదకుతున్నారో అతనినే వెదకమని బోధించారు శ్రీ భగవాన్. అలాంటి స్థితిలో వెదికేవాడు, వెదకబడు తున్న వస్తువు రెండూ ఏకమవుతాయి. ఇక ఇట్టి స్థితిలో రాగద్వేషా లుండవు. వేరుగా ఉన్నదనేది అక్కడ వుండదు. అంతా అనన్య మయిన, అభేద దృష్టి మిగులుతుంది. ఉన్నది "ఉనికి" ఒక్కటే. సహజ సమాధి స్థితి.

ఒకవేళ ఆత్మవిచారణ కష్టమనిపిస్తే, శరణాగతి చెంద మంటారు శ్రీ భగవాన్. ఒకమారు శరణొందితే అటుపై భగవంతుని దేనికొరకూ ప్రార్థించవద్దంటారు. లభించిన దానిని సంతోషంగా స్వీకరించాలి. సర్వమూ ఈశ్వర సంకల్పమని భావించిన తర్వాత ఇక మన సంకల్పమేముంటుంది? అన్నిటిని స్వీకరించగలగడమన్నదే నిజమైన సంకల్ప బలము. దాని కోసం సన్యసించి అరణ్యాలకు వెళ్లాల్సిన అవసరం లేదు అంటారు భగవాన్. అరణ్యానికి వెళ్లినా మనస్సు మనతోనే వుంటుంది. ఏకాంతం మనస్సులో ఉంది కాని బయట లేదు. అహంకార నాశమే ఏకాంతం. అది లభించిందంటే భగవాన్ అనుగ్రహమే.

ఒక్క విషయం మనం గుర్తుంచుకోవాలి. బాహ్యపరిస్థితుల నుండి పొందే ఆనందం క్షణికము, అనిత్యము. ''నేనెవరు'' అని విచారణ చేయడం శ్రేయస్కరము. నిజమైన ధ్యానం అంటే అక్కడ ధ్యానకర్త లేకపోవడమే. ధ్యానకర్త, ధ్యానము ఏకమయిన స్థితి అది.

* * *



# బ్రహ్మ కమలం, చిత్ సరస్వతి

ముదిగొండ వీరభద్రయ్య

**బ్రహ్మకమలం**

గాలి నిలిచింది
తరంగాలాగినవి
శబ్దబ్రహ్మ నీరవమై
ప్రశాంతమైనది
అంతులేని శాంతి.

కాలపురుషుడు
తన్ను కోల్పోయాడు
వినడానికి చూడ్డానికి
ఏమీ లేదు. నిజం.
అంతా సత్త్వమే
ప్రశ్న లేదు, సమాధానమూ లేదు
చీకట్లు లేవు, వెలుగులు లేవు
చూసేందుకు ఏదీ లేదు
తాను తప్ప. నిజం చెప్పాలంటే
నేను తానులిప్పుడు
దక్షిణామూర్తి యే
జ్ఞాన బుద్ధుడే
కేవలుడే.
ఇదే సిద్ధి
ఇది సాధ్యమే
ఈ చిత్సరసిలో నుంచి
ప్రభవించిన దివ్య కమలమ్
శాశ్వతమగుగాక.

**చిత్సరస్వతి**

అథోముఖంగా ఇన్నాళ్లు
శరవేగంతో ఉరుకులెత్తిన
నా నాదసరస్వతి
రక్తి కట్టించినది నిజమే,
లోకులనుర్రూతలూగించిందీ
నూరుపాళ్ళు నిజమే,
కాని నన్ను కీర్తి ప్రతిష్ఠల
వ్యామోహపు చెరలోకి
తోసినదీ అంతే నిజం.

కాని ఇప్పుడా సరస్వతే
ఊర్ధ్వ ముఖంగా అధిరోహించి
బ్రహ్మ సరస్సుకి చేరువయి
శాంత బ్రహ్మమయి
అనంతబ్రహ్మానందంలో
తన అస్తిత్వం విడిచి
తానే ఆనందరూపిణిగా
నాదసిద్ధిగా మోక్షమాతగా
ఆవిష్కారమయింది.

ఇంక సరస్వతిగా కన్నా
అమ్మా! చిత్ సరస్వతి గానే
నిలిచిపో, శాశ్వత మై పో.

# రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు
# శ్రీమతి సూరినాగమ్మ గారు

- కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి

భగవాన్ రమణమహర్షి వైపు ఒక్కసారి చూడగానే, నోట మాటరాక అమితమైన ఆశ్చర్యంలో ఆమె మునిగిపోయారు. కారణం జ్ఞానుల యొక్క లక్షణాలను పుణికి పుచ్చుకున్న ఒక మహాత్ముడు, సుమారు అప్పటికి 30 సంవత్సరాల క్రిందట తన స్వప్నంలో దర్శనమిచ్చిన వారే ఈ రమణమహర్షిగా గుర్తించడం. ''నా దగ్గరకు రావడానికి నీకింత కాలం పట్టిందా? అని ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది మహర్షి చూపు. దానితో ఆమె మరింత సంభ్రమాశ్చర్యాలకు లోనై వెంటనే వారిని మానవరూపం ధరించిన దైవంగా గుర్తించారు. ఆయనను తన సద్గురువుగా ఎంచుకోవడమేగాక అరుణాచలంలోనే శాశ్వతంగా ఉండి పోవాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నారు. ఆమెయే సూరి నాగమ్మగారు.

గుంటూరు జిల్లాలో మంగళగిరి దగ్గరనున్న 'కొలనుకొండ' అగ్రహారంలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. తల్లి దండ్రులు గోర్భల చినవెంకటశాస్త్రిగారు, సోమదేవమ్మగారు ఆమె చిన్నతనంలోనే మరణించారు. బాల్యంలో వివాహం జరగగా భర్త కూడా కొంత కాలానికే పోవడంతో మానసిక క్షోభకు గురి అయ్యారు. అలాంటి సమయంలో మహాత్ములను గురించిన మాటలు, పాటలు ఆమెకు మానసికశాంతిని ప్రసాదించాయి. కనీసం పాఠశాల విద్యకు కూడ నోచుకోని నాగమ్మగారు ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం మూలంగా తన మాతృభాష అయిన తెలుగును నేర్చుకుని దానిలో పట్టు సాధించారు. ముఖ్యంగా, భాగవత గ్రంథంలో 'కపిలుడు' తన తల్లికి ముక్తిని పొందే మార్గాన్ని బోధించే ఘట్టము ఎంతగానో ఆమెను ప్రభావితం చేసి ఆమె జీవితాన్నే మలుపు త్రిప్పింది. ఎవరైనా మహాత్ముని కలుసుకొని ఆయన సేవలో తరించాలని తపనపడుతున్న సందర్భంలో ఆమెకు కలలో దక్షిణామూర్తిని పోలిన సిద్ధపురుషులొకరు దర్శనమిచ్చారు. కుటుంబ బాధ్యతల మూలంగా సద్గురువును ఆశ్రయించాలన్న ఆమె కోరిక అప్పటికి వాయిదాపడింది.

కొన్ని పరిస్థితుల కారణంగా కుటుంబం అంతా విజయవాడకు తరలిరావడంతో అక్కడ ఆమెకు సత్సాంగత్యం లభించడమేగాక, మరిన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను చదివే అవకాశం కలిగింది. తరువాత కొన్ని సంవత్సరాలకు తన సోదరుడైన డి.ఎస్.శాస్త్రిగారి ప్రోత్సాహంతో అరుణాచలం వెళ్ళారు. అక్కడ భగవాన్‌ను తన సద్గురువుగా గుర్తించ గానే అనేక గీతాలు, కవితలు, పద్యాలు వాటంతట అవే అప్రయత్నంగా ఆమె మనసునుండి వెలువడసాగాయి. సత్పురుషులను సేవించి ముక్తిని పొందాలనే ఆమె కోరిక ఎట్టకేలకు ఆమెను భగవాన్ సన్నిధికి చేర్చింది. భగవాన్‌ను సేవిస్తూ, భగవాన్ ఉపదేశ గ్రంథాలన్నీ శ్రద్ధగా చదివి మననం చేసుకుంటూ ఎక్కువ సమయం సాధనలో గడిపేవారు.

ఆ ప్రయత్నంలో అప్పుడప్పుడు కలిగే సందేహాలను ఒక చీటీపై వ్రాసి భగవాన్ వద్దకు పంపేవారు. "ఎందుకు ఈ సందేహాలను పట్టించు కుంటారు? వాటిని గమనించేకొద్దీ అవి బలపడతాయి. లోనికి మునగండి" అన్న భగవాన్ సమాధానంతో తృప్తిపడి ఒక మంచి విద్యార్థినిగా భగవాన్ సూచించిన ఆత్మవిచారణలో మునిగిపోయేవారు. ఈ సాధనలో తానెవరో తెలుసుకోవాలంటే తనలోపలికి చూచుకుంటే చాలు అన్న విషయాన్ని చాలా స్పష్టంగా గ్రహించారు.

అరుణాచలం చేరిన ఆమెకు ఎచ్చమ్మాళ్ అనే యోగినీమణి ఇంటి ప్రక్కనే ఇల్లు దొరకడం వరమైంది. భగవాన్‌ను సేవిస్తూ ఆత్మలో స్థిర పడిపోయిన ఎచ్చమ్మాళ్ యొక్క పరిచయంతో ఆమెకు గొప్ప సత్సంగం లభించినట్లయింది. ఆ ప్రభావంతో ఒకరోజు సూరినాగమ్మగారు భగవాన్‌ను "దయచేసి నేను ముక్తిని పొందడానికి తోడ్పడండి" అని ప్రార్థించారు. అప్పుడు భగవాన్ ఆమెవైపు తిరిగి అంగీకరిస్తున్నట్లు తల ఊపారు. భగవాన్ ఆ విధంగా ప్రతిస్పందించడం చాలా అరుదు అని ఎచ్చమ్మాళ్ ఆమెతో అన్నారు. భగవాన్ సాధకులలో ప్రతి ఒక్కరికి వారివారి అంతర్గతస్వభావాన్ని అనుసరించి ఆధ్యాత్మికపరమైన సూచ నలను ఇచ్చేవారని ఆమె గ్రహించారు. అందుకే ఆమె ఒక కవయిత్రియే గాక ప్రతిభగల రచయిత్రి అనే విషయాన్ని పరిగణనలోనికి తీసుకుని ఆమెను ఆధ్యాత్మికపథంలో నడిపించారు. తెలుగు వ్రాతప్రతుల విషయంలో ఆమెను సమర్థురాలిగా గుర్తించి, ఒక



పెద్ద బౌండ్‌నోట్ పుస్తకాన్ని భగవాన్ స్వయంగా ఆమెకు ఇచ్చారు. ఇక ఆ రోజు నుంచి తెలుగు రచనలన్నింటిని వ్రాయుటకు, కాపీ చేయుటకు, భద్ర పరచుటకు ఆమె అధీకృత వ్యక్తి అయ్యారు.

దీనితో భగవాన్‌కు బాగా సన్నిహితంగా ఉండగలిగే అపురూపమైన అవకాశం ఆమెకు లభించింది. ఆ సమయంలో భగవాన్ జరిపే ప్రశ్నోత్తరాలను లేఖలరూపంలో వ్రాసి భగవాన్‌కు చదివి వినిపించగా ఆయన వాటిని మెచ్చుకోవడంతో ఆమె క్రమం తప్పకుండ లేఖలను వ్రాయడం మొదలుపెట్టారు. అవే తరువాతి కాలంలో 'రమణాశ్రమ లేఖలు' అనే పేరుతో గ్రంథరూపంలో ప్రచురింపబడ్డాయి. దాని మూలంగా రమణభక్తుల హృదయాల్లో ఆమె ప్రియమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇంతేగాక ఆమె వ్రాసిన 'నా రమణాశ్రమ జీవితము' అనే తన జ్ఞాపకాలు సమాజాన్ని చాలా ప్రభావితం చేశాయి. ఆ రచనను ఆమె సోదరుడు డి.ఎన్. శాస్త్రిగారు ఆంగ్లంలోనికి అనువదించారు.

ప్రతి తెలుగు ఉగాది ముందు రోజు సాయంత్రం ఒక 'కాపీనాన్ని' భగవాన్‌కు సమర్పించడం తన అలవాటుగా పెట్టుకున్నారు నాగమ్మ గారు. భగవాన్ ఆఖరి రోజులలో చివరి ఉగాది ముందు రోజున ఎప్పటి లాగే కాపీనాన్ని సమర్పిద్దామని తీసుకు వచ్చి దానిని ఆ స్థితిలో స్వీకరిస్తారా లేదా అని తటపటాయిస్తున్న సమయంలో భగవాన్ దానిని స్వీకరించడం ఆమె గురుభక్తికి నిదర్శనం. అనేక అంతరాయములను

తట్టుకుంటూ ఆధ్యాత్మిక జీవితం గడిపిన సూరినాగమ్మగారు భక్తి శ్రద్ధలతో భగవాన్‌ను సేవించిన కారణంగా కష్టాలన్నీ తొలగి ప్రశాంతంగా జీవించగలిగారు. సద్గురు కటాక్షం వల్లనే అది సాధ్యమైనదని సూరినాగమ్మగారి జీవితం చెప్తున్నది.

ఆమె చివరి రోజులలో ఒంటరిగా, విజయవాడలో ఒక కుటీర మందు ప్రశాంతంగా జీవనాన్ని గడుపుతూ, ఎవరైనా జిజ్ఞాసువులు వస్తే వారికి సందేహనివృత్తి చేస్తూ, ఉత్తమ గ్రంథాలు చదివి వినిపిస్తూ, సరియైన ఆధ్యాత్మిక మార్గాన్ని చూపిస్తూ 1980 మార్చ్ 31న భౌతిక కాయాన్ని వీడి భగవాన్‌లో ఐక్యమొందారు.

*(ఆధారం: రమణ పెరియ పురాణం, నా రమణాశ్రమ జీవితం)*

*(ఈ వ్యాసం రమణజ్యోతి మే, 2017 సంచికలో ప్రచురించబడింది. ప్రస్తుత ధారావాహికలో తిరిగి ప్రచురిస్తున్నాము)*



# నమ్మకం - విశ్వాసం

(మౌంటెన్‌పాత్ అక్టోబర్-డిసెంబర్, 2011 (సంపుటి 48, సంచిక-4) లోని సంపాదకీయం నుండి ఎన్నుకొనబడిన భాగాల అనువాదం)

(గత సంచిక తరువాయి) - డా. వి. రామదాస్ మూర్తి

భగవాన్ మనకు ఖచ్చితంగా నిర్దేశించిన మార్గాన్ని సూచించారు. తమ జీవన ప్రయాణంలో స్వయంగా సరిచూసి, సూటియైనది, సమర్థవంతమైనదిగా నిరూపించారు. అది ఒక గుడ్డి నమ్మకానికి సంబంధించినది కాదు. సాధకుని అన్వేషణకు అనువైనది. కాని మనల్ని గమ్యానికి చేర్చే ఆ ప్రవాహంలో ప్రవేశించడం ఎలాగ అన్నదే అసలు ప్రశ్న. అందుకు గాఢమైన నిశ్చలత అవసరం.

ఈ సందర్భంలో మామూలుగా వాడుకలో వుండే ఒక చిక్కు ప్రశ్నను వేసుకోవచ్చు - కోడిముందా? గుడ్డుముందా? ఈ మార్గాన్ని అనుసరించడానికి నమ్మకం ముఖ్యం. కాని ఆ నమ్మకం కలుగజేసుకొనడం ఎలా? ఆ నమ్మకం కలగడానికి మరొక మౌలిక మైన నమ్మకం అవసరమా? ఏమీలేని స్థితి నుండి మరొక దానిని సృష్టించలేమే! ఇదే కీలకమైన సమస్య. అదేదో మనం కోరుకుంటే లేదా అజ్ఞాపిస్తే జరిగే విషయం కాదు. మనం ఆ స్థాయికి చేరుకున్నప్పుడు దానంతట అదే జరుగుతుంది. ఈ విషయానికి సంబంధించిన ఒక సంభాషణ ఇలా సాగుతుంది:

భక్తుడు: ఎవరిని ఆత్మ ఎన్నుకొంటుందో వాడే ఆత్మను తెలుసుకోగలడని ఉపనిషత్తులు చెబుతున్నాయని విన్నాను.

అసలు ఆత్మ ఎందుకు ఎన్నుకోవాలి? అలా ఎన్నుకొనడం అంటూ జరుగుతుందని అనుకుంటే, ఏదో ఒక వ్యక్తి విషయంలో మాత్రమే ఎందుకు జరగాలి?

భగవాన్: సూర్యుడు ఉదయించినప్పుడు అన్ని మొగ్గలూ విచ్చుకోవు. కొన్ని మాత్రమే విచ్చుకుంటాయి. దానికి సూర్యుడిని నిందిస్తామా? అలాగని మొగ్గ తనందట తానుగా విచ్చుకోలేదు, సూర్యరశ్మి అవసరం.

భక్తుడు: ఆత్మ తనంతట తానుగా 'మాయ' అనే ముసుగును వేసుకుని వుంటుంది గనుక ఆత్మ సహాయం అవసరమవుతుందని అనుకోవచ్చా?

భగవాన్: అలా చెప్పవచ్చు.

భక్తుడు: తానే ముసుగును కప్పుకున్న ఆత్మ తనంతట తాను దాన్ని తొలగించాలి కదా?

భగవాన్: అలా చేస్తుంది. ఆ ముసుగు ఎవరి కోసమో గమనించు.

భక్తుడు: నేనెందుకు గమనించాలి. ఆత్మనే ఆ మాయను తొలగించనివ్వండి.

మహర్షి: ఆత్మ మాయను గురించి మాట్లాడిందని అంటే, ఆత్మే దానిని తొలగిస్తుంది.

ఈ విషయంలో భగవాన్ ఒక లలితమైన తేడాను సూచిస్తారు. ఎప్పుడూ మూలసూత్రాల ఆధారంగానే మాట్లాడే భగవాన్ యొక్క



బుద్ధికుశలత ఈ సందర్భంలో కూడ విశదమవుతుంది. అసలు మాయను ఏది సృష్టించిందో అదే మాయను తొలగిస్తుందంటారు. మాయ కప్పడం, దాని ప్రభావం, వీటిని మహర్షి అసలు నమ్మదగినవిగా భావించరు. మాయ అంటూ ఒక ముసుగు యొక్క ఉనికి, లక్షణాలను గురించి మాట్లాడకుండ, మూలాల లోనికి తీసుకుని వెళ్ళి, మనల్ని మోసం చేయగలశక్తి ఏదీ మాయకు లేదని చెబుతారు. మాయకు ఆ శక్తి వున్నదా లేదా అన్న దానికంటే అసలు మాయ ఒక స్వతంత్రమైన, నిర్ణయాత్మక మైన ప్రభావం గల అంశంగా గుర్తించడానినే అంగీకరించరు.

మామూలుగా మనం నమ్మకం అంటే తార్కికంగా ఆలోచించే బుద్ధితో గ్రహింపలేని ఒక అంశంగా భావిస్తాము. మనం దేన్ని "ఆత్మ" (అనబడే అసలైన సత్యం) అని భావిస్తామో, అది నిజానికి స్వయం వ్యక్తమయ్యేదే. మన బాహ్యమైన ఉనికిని కాదనలేము కదా! దృఢమైన నమ్మకాన్ని ప్రదర్శించినప్పుడు అదే ఒక సమర్థ వంతమైన వాహికగా పనిచేసి నిజాన్ని తెలియజేస్తుంది.

*(సమాప్తం)*

# గురురూప సందర్శనము

- దోనెపూడి వెంకయ్య

ఉన్నాడయా రమణుడున్నాడయా ।
ఉన్నాడయా రమణుడున్నాడయా ॥
తన్ను చూడదుకన్ను అన్నీ చూచును కాని
కన్నుకు కన్నుగా ఉన్నాడయా
మన్నుమిన్నేకముగా ఉన్నాడయా
అన్నియు తానె యై ఉన్నాడయా ॥ 1
మనసుకందనివాడు మాటకందనివాడు
మనసులోనే దాగి ఉన్నాడయా
మనసుగా కూడ తానున్నాడయా
వెనుదిరిగి కనతోచుచున్నాడయా ॥ 2
సర్వమెఱిగినవాడు సర్వులెఱిగినవాడు
సర్వదా ఉనికియై ఉన్నాడయా
సర్వుడై శర్వుడై ఉన్నాడయా
సర్వత్ర తానె యై ఉన్నాడయా ॥ 3
అంటియంటని యట్టులగుపించునే కాని
కంటికి ఱెప్పగా ఉన్నాడయా
చంటిపాపగ సాకుచున్నాడయా
జంటయై నావెంట ఉన్నాడయా 4



ఇచట చూచినగాని అచట చూచినగాని
ఎచట చూచిన గాని ఉన్నాడయా
అచలాకృతిని దాల్చి ఉన్నాడయా
అచల తాండవమాడుచున్నాడయా ॥ 5
విత్తము నొల్లడు జిత్తులకు లొంగడు
చిత్తాపహారకుడు ఉన్నాడయా
హృత్తాపవారకుడు ఉన్నాడయా
చిత్తేశు డుత్తారకు డున్నాడయా ॥ 6
వాక్కుపలుకులుడిగె త్వక్కు పులకలెక్కె
చెక్కిలికేల నొక్కియున్నాడయా
దృక్కనిమేషమై ఉన్నాడయా
నిక్కపు సమాధిలో ఉన్నాడయా ॥ 7
నవ్వినచో స్వామి నవరత్నము లొలుకు
నవ్వ వెన్నెలకురియు నన్నారయా
నవ్వమల్లెలు విరియు నన్నారయా
నవ్వ ఝల్లను ఉల్లము అన్నారయా ॥ 8
దివ్వె వెలిగినట్లు నవ్వు నవ్వినయట్లు
దవ్వేలేని యట్టులున్నారయా
క్రొవ్విరి చిదిమినట్టు లన్నారయా
ఎవ్వడ నేనని కనుట అన్నారయా ॥ 9

# హృదయం, మనసు

(శ్రీరమణజ్యోతి, ఏప్రిల్ 2016 (సంపుటి 36, సంచిక-4) లో శ్రీ నండూరి శ్రీరామమోహన్‌గారి 'హార్ట్ అండ్ మైండ్' అన్న వ్యాసం యొక్క అనువాదం) అనువాదం: శ్రీవత్సస

జాగ్రదవస్థలో మన ఉనికి రెండు విడి విడి, ప్రత్యేక స్థాయిలలో వుంటుందని భగవాన్ అంటారు. మొదటిది మూలము, యథార్థమైన ఉనికి - ఆత్మ. ఇక రెండవది మనం సాధారణంగా లౌకిక దృష్టితో మాట్లాడినప్పుడు వస్తు, విషయ జ్ఞానంతో మనం ఉన్నామని భావించే ఉనికి. వస్తు విషయాలను గురించిన భావన వున్నంత కాలం, ఆ అసలైన చైతన్యంగా వుండే ఆధారాన్ని గుర్తించలేము. ఈ పరిస్థితి ఎందువల్ల ఉదయిస్తుంది?

కాని, మెలకువ స్థితిలోనే, అప్పుడప్పుడు చైతన్యం ఉదయించడం, గాఢనిద్రావస్థలో అణగినప్పటికీ, శరీరంలోని వివిధ అంగాలు, జ్ఞానేంద్రియాలు, మన ప్రమేయం లేకుండ నియంత్రించబడడం, మనం మామూలుగా గ్రహించం. అంటే ఈ చర్యలనన్నింటిని నిర్వర్తించే ఆ మూలం ఒకటి వున్నదని అంగీకరించక తప్పదు. అంతే గాకుండ ఆ మూలం లేకుండ మనకు స్వతంత్రమైన ఉనికి లేదన్నది కూడ విశదమౌతుంది. ఆ మూలాన్ని భగవాన్ 'ఆత్మ' ఇంకా 'అహం', 'హృదయం,' 'మూల శక్తి' అని పలువిధాలుగా పేర్కొంటారు. ఆ మూలస్థానం నుండే చిత్తం (మనసు) ప్రాణం (శ్వాస) ఉదయిస్తాయి. ఆ యథార్థమైన చైతన్యమే 'నేను-నేను' అని ప్రకాశిస్తూ వుంటుంది.



'హృదయం' అన్నది వేదాలు, ఆధ్యాత్మిక గ్రంథాలలో కూడ 'నేను' అన్న భావన ఉదయించే కేంద్రంగా సూచించబడింది. అంటే, ఆ 'మాంసపు బంతి' నుండి అది ఉదయిస్తోందా? కాదు. మన లోపల ఎక్కడో మధ్యలో నుండి అది మొదలౌతుంది. దానికి ఒక ప్రత్యేక స్థానమంటూ లేదు. అంతా ఆత్మయే. ఈ ఆత్మ మరేదీలేదు, అంటారు భగవాన్. "అంటే హృదయం మన శరీరం, ఆ మాటకొస్తే, మొత్తం ఈ విశ్వాన్ని హృదయంగా, ఆత్మగా పరిగణించాలి. కాని 'అభ్యాస' స్థాయిలో వున్న సాధకులకు సహాయపడడానికి, ఈ విశ్వంలో ఏదో ఖచ్చితమైన భాగం, లేదా శరీరంలో ఒక ప్రత్యేకమైన భాగంలో అది నెలకొనివున్నట్లు చెప్పాల్సి వస్తుంది. అందుకే, ఆ 'హృదయం' ఆత్మయొక్క నిలయమని అంటారు. కాని యథార్థమేమిటంటే, మనం అన్ని చోట్ల వున్నాము, వున్నదంతా మనమే, ఇక వున్నదంటూ వేరే మరేమీ లేదు. (టాక్ 29).

"హృదయం అన్నది భౌతికమైన వస్తువు కాదు. అది ఆధ్యాత్మిక సంబంధమైనది. హృదయం (హృత్-అయం). ఇది కేంద్రం. ఆలోచనలు మొదలయ్యేది ఇక్కడ నుండియే. ఇక్కడే అవి వృద్ధి చెంది, పోషించబడి, పరిష్కరింపబడతాయి. యతోవా ఇమాని భూతాని జాయంతే (సకల జీవుల ఉనికి ఇక్కడే ప్రారంభ మౌతుంది) మొదలైన ఉపనిషత్తు వాక్యాలు అదే బ్రహ్మన్ అని తెలియజేస్తున్నాయి. అదే హృదయం, అదే బ్రహ్మన్" (టాక్ 97).

మనసు యొక్క భౌతిక స్థానం మెదడు. హృదయం మెదడు

గ్రహించిన ప్రకాశంతోనే మనసు ప్రకాశిస్తుంది. శిరసులో పరావర్తనం చెందిన చైతన్యాన్ని 'అభాస సత్' అంటారు. ఆ పరావర్తనంతో శిరసు చురుకుగా మారినప్పుడు మనం జాగ్రతావస్థలో వున్నట్లు భావిస్తాం. అప్పుడు మన భౌతిక ఉనికి, అంటే 'నేను ఉన్నాను' అన్న భావన బయటపడుతుంది. ఆ భావననే భగవాన్ 'నేను ఆలోచన' అంటారు. అదే మొట్టమొదటి, లేదా మూలమైన ఆలోచన. ఎందుకంటే, అది మన మనసు ప్రకాశింపబడినప్పుడు ఉదయిస్తుంది. 'నేను ఆలోచన' వెంబడి ఇతర ఆలోచనలు బయటపడతాయి. పరావర్తనమైన ప్రకాశం వల్ల మనసు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పనిచేయడం మొదలు పెడతాయి. ప్రపంచం గురించిన దృష్టి తెరమీదకు వస్తుంది. శిరసు నుండి ఈ చైతన్య ప్రకాశం తొలగినప్పుడు, అది వాలి, మనం గాఢనిద్రావస్థలో వున్నట్లు భావింపబడుతుంది. అలాగ, మనసు, శారీరక కార్యక్రమాలు అన్నీ ఆత్మ నుండి వెలువడుతాయి. చైతన్య ప్రకాశం ఎప్పుడూ శరీరంతో మమేకం కాదని భగవాన్ అంటారు. కాని, విచిత్రం ఏమిటంటే అలా వున్నట్లే తోస్తుంది. ఇక వ్యక్తి భావన మొదలౌతుంది. ప్రకాశంతో బాటు 'అతడు' ప్రత్యక్షమౌతాడు. అది తొలగినప్పుడు అదృశ్యమౌతాడు. వ్యక్తికి స్వతంత్ర ప్రతిపత్తి అంటూ లేదు.

హృదయం, మనసుల పరస్పర స్థితిగతులను ఒక దృష్టాంతంతో విశదపరచవచ్చు. సూర్యుడు తన ప్రకాశంతో భూమి మీది జీవరాశులను పోషిస్తాడు. చంద్రుడు సూర్యుని నుండి అందుకున్న



ప్రకాశం యొక్క పరావర్తనంతో ప్రకాశిస్తాడు. రాత్రిళ్ళు చంద్రకాంతి చల్లగా వుంటుంది. కాని ఆ వెలుగు జీవకోటి పోషణకు సరిపోదు. ఆ వెలుగులో వస్తువులను స్పష్టంగా చూడలేము. హృదయం నుండి వెలుగు మనసును ప్రకాశింప జేస్తుంది. ఈ పరావర్తనం చెందిన ప్రకాశం యొక్క సహాయంతో గ్రహణ శక్తిని పొందుతుంది. హృదయమనే కేంద్రం ఒకటి వుందన్న అంతర జ్ఞానం లేని వ్యక్తి తాను జరిపే చర్యలన్నీ మనసుచేత ప్రేరేపితాలే అన్న భ్రాంతితో వుంటాడు. అందుకే రాత్రిళ్ళు సూర్యుడిని కనలేనివాడైనందున చంద్రకాంతినే ఆధారంగా సరిపెట్టకుంటాడు. శరీర ధ్యాస మాత్రమే వున్న వ్యక్తి అజ్ఞానం కారణంగా ప్రకాశం యొక్క మూలస్థానం అంటే చైతన్యాన్ని గుర్తించలేడు. మనసు ఆధారంగా అతడు వస్తువులను దర్శించి, అవి తన నుండి వేరు అన్న అభిప్రాయానికి వస్తాడు. కాని హృదయంలో సుస్థిరుడైన జ్ఞాని పగటి పూట చంద్రుని చూచిన విధంగా ఆ కాంతికి ఏ విలువనూ ఇవ్వడు.

మనసు ఒక ఆలోచనల మూట అని భగవాన్ అంటారు. అన్ని ఆలోచనలూ, ఒక మౌలిక ఆలోచన నుండే ఉద్భవిస్తాయి. వీటి అన్నింటి వెనుక ఉండి నడిపిస్తున్నది 'నేను-ఆలోచన' అని గుర్తించాలి. ఎవరికైన ఏ ఆలోచన గాని ఉదయించినప్పుడు అది కేవలం ఆ వ్యక్తికి భిన్నంగా, స్వతంత్రంగా వచ్చినదా లేదా ఆ వ్యక్తికి మాత్రమే కలిగిన ఆలోచనయా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. అది వ్యక్తిగా వున్న నా నుండి వచ్చినది, నాతో ఉద్భవించినది, అని సమాధానం వస్తుంది. అంటే మూలమైన 'నేను - ఆలోచనను'

ఒక కొమ్మలాగ ఆధారంగా చేసుకుని అన్ని ఇతర ఆలోచనలు బయటపడతాయి. అందుకే ఈ 'నేను-ఆలోచన'యే మనసు అని గుర్తించాల్సి వస్తుంది.

'హృదయం' భౌతికమైనది కాదు. అందుకే ధ్యానాన్ని ఎడమ వైపు లేదా కుడివైపున కేంద్రీకరించాలా అన్న ప్రశ్నలేదు. ఆత్మను కేంద్రంగా ధ్యానం జరపాలి. 'నేను-ఉన్నాను' అన్నది అందరికీ తెలిసినదే. ఈ 'నేను' అన్నది ఎవరు? అది మన లోపల లేదు, బయటా లేదు. కుడివైపున లేదా ఎడమ వైపున ఉందా అన్న ప్రశ్న లేదు. ఈ హృదయం అనే కేంద్రం నుండే ప్రతి ఒక్కటి ఉద్భవించేది. నీవు బాహ్యంగా ప్రపంచాన్ని, శరీరాన్ని చూస్తావు. ఆ దృక్పథంతో గమనించినప్పుడు హృదయమనే 'కేంద్రం' ఒకటి వుందని వ్యవహరిస్తారు. హృదయంలో స్థిరంగా వున్నవారికి, నిజంగా లోపల, బయట అన్న ప్రసక్తి లేదు. నిజానికి, హృదయం ఒక కేంద్రమూ కాదు, దానికి పరిధి అంటూ వుండదు. వేరే ఇంకేమీ లేదు. దేనికి అది కేంద్రంగా వుండగలదు'' అని భగవాన్ అన్నారు. (టాక్ 273).

'నేను-ఆలోచన' యొక్క మూలస్థానాన్ని చేరడం ఎలా? మనసును లోనకు మరల్చి, దాని మూలాన్ని 'చూడాలి' అని భఘవాన్ అంటారు. అసలు గమనించి ఇంద్రియాల ద్వారా 'చూడడానికి' అక్కడ ఏమీ వుండదు. ఈ అన్వేషణను హేతుబద్ధమైన రీతిలో వివరించడానికి కూడ ఇంద్రియాల సహకారం వుండదు. కాని మనకు 'సహజజ్ఞానం' (అంతర జ్ఞానం)



గనుక ఉంటే, 'కేంద్ర'మైన ఈ హృదయం గుర్తింపబడుతుంది. అలాగే విచారించబడుతున్న 'నేను' ఆ 'కేంద్రం' లో కలిసిపోతుంది. ఒక భక్తుడు ''ఆలోచనలు అకస్మాత్తుగా ఆగిపోతాయి. అప్పుడు అసలు 'నేను' బయటపడుతుంది. అది ఒక అనుభవంగానే వుంటుంది. బుద్ధికి సంబంధించినదిగా తోచదు. అది సరియైనదేనా'' అని అడిగాడు. ''ఖచ్చితంగా నిజం. ఆలోచనలు ఆగినప్పుడే అసలు 'నేను' తెలుస్తుంది. ఇక్కడ ముఖ్యమైనది అనుభూతి గాని, హేతుబద్ధత కాదు'' అని భగవాన్ జవాబిచ్చారు. (టాక్ 24).

* * *

# రమణ స్తుతి

గాలి సుబ్బలక్ష్మి, వేమూరి విజయశ్రీ

## (1)

పల్లవి: ఈశ్వరా..... పరమేశ్వరా..... అరుణాచలేశ్వరా....
తండ్రివలె బ్రోవుము అరుణాచల
నిను మించు దైవము లేదీ ఇలలో భువిలో
కన్న తండ్రి వలె బ్రోవుము ॥

చరణం 1: మాయను పడితిని మోహము విడవను
ఆర్తితో పిలిచేను అరుణాచల
భవసాగర మీద చుక్కాని నీవై
మోక్ష తీరమును చేర్చుము దేవా
॥కన్న తండ్రి వలె బ్రోవుము ॥

చరణం 2: తరగదు పాపము పెరగదు పుణ్యము
జననమరణ చక్రములో విసిగి వేసారితి
మోహపాశ బంధములు తొలగించ నీవే
నిర్గుణ పరబ్రహ్మ సాన్నిధ్యమివ్వు
॥కన్న తండ్రి వలె బ్రోవుము ॥

చరణం 3: నీ ఆనలేనిదే నిను తలవలేము
తుది ఘడియలలో నీ స్మరణమీయవా
నీ ఒడిని చేర్చుకొని అరుణాచల
శాంతి చేకూర్చుము కరుణాసాగర కన్న
॥కన్న తండ్రి వలె బ్రోవుము ॥



చరణం 4: ఆపదవేళలను, అలసిన వేళలను
సుఖమైన, దుఃఖమైన నీవే మాకు తోడు
నీ నామమే నాకు వేరు గతి లేదు
నీ చరణములే శరణము వేడితి
॥కన్న తండ్రి వలె బ్రోవుము ॥

## (2)

పల్లవి: శ్రీరమణ పాదమా
సర్వశాస్త్ర సారమా
సర్వ మంత్ర ఫలమా
సకల వేద నిలయమా
॥శ్రీ రమణ పాదమా॥

చరణం 1: పాపనాశన ఖడ్గమా
అంధకార హరణమా
కరుణ కురిసే నయనమా
శాంతి నొసగే హృదయమా
॥శ్రీ రమణ పాదమా॥

చరణం 2: ఆశ్రితులకు అభయమా
అభయహస్త యుగళమా
ఆత్మజ్ఞాన మార్గమా
ఓంకార స్వరూపమా
॥శ్రీ రమణ పాదమా॥

* * *

# Gems From Adi Sankara's Bhaja Govindam

Dr.K.Subrahmanian (Talks 7B, 10B)

The most important thing for spiritual progress is humility. Arrogance and spirituality do not go together. Anyone who says my guru is the best, other gurus are useless is anything but spiritual. The world is a very big place, and we know very little. It is wrong to say anything about other gurus. A guru who says that other gurus are useless, whatever he is, he is not a guru. A real guru is one who will treat all alike. He has no ego of any kind whatsoever; his compassion is unbounded, unlimited. A real guru is one who will follow you even to hell. He is not displeased when you leave him because he knows why you are leaving him. Even if you forget the guru for some time, the power and compassion of the guru is such that you will go back to him. He may even send you to another guru if that is what is needed for your progress. He is not one who says, "You have to stay with me alone". He gives you the liberty to change gurus if you feel sincerely that the other guru will take you to a newer path. A real guru is one who is not of this world, but strangely, who is deeply engaged with this world.

That is why association with the real guru takes you to the highest plane. Adi Sankara says in *Bhaja Govindam*:

*Satsangatve nissangatvam, nissangatve nirmohatvam*
*nirmohatve niscalatatvam, niscalatatve jeevanmuktih*

Even in ordinary life, we see how ordinary people can acquire enormous power by association with the great. An uneducated peon in the Chief Minister's office has the power to prevent a Minister from entering the Chief Minister's



chamber! He has acquired importance due to his association. There is this popular story about the snake crawling over the neck of Lord Siva calling out to Garuda, "Eh Garuda! How are you? Are you alright?" Under any other circumstance, the snake would try to slither away and hide at the very sight of Garuda! The point of this story is, associate yourself with the best. It will make you fearless and powerful. In other words, *satsang* is the best in all the worlds.

*Satsang* will give you peace, *satsang* will give you tranquility, and *satsang* will give you what you cannot get elsewhere. To get *satsang* is very difficult. You can get people to attend election meetings, but it is difficult to get people who think of God or guru for a stretch of time. That's why all of our sages and saints talk about the importance of *satsang*.

*Nissangatvam* means the mind gets detached; at least during this period the mind is detached from your worries, your family, and so on. When you are detached, you are free from all *mohas* or illusions and delusions, *nirmohatvam*. This leads to *niscalatatvam,* that is, the mind becomes free by becoming tranquil. *niscalatatve jeevanmuktih:* when your mind becomes tranquil, you gain *jeevanmukti* or liberation while alive. Sankara says the basis of all this is to start with satsang.

What is the best time for it? He responds in another verse :

*baalastavatkridaa-saktah, tarunastaavat- tarunisaktah*
*Vridhastavat-chintasaktah parebrahmani kopi-na-saktah*

Sankara says, *baalastavatkridasaktah* - when you are a young boy your interest is in playing; *tarunastaavat-tarunisatkah*- when you are a young man, your interest is in women; *Vridhastavat-chintasatkah*- when you are old, you spend time thinking all the time about so many things. You think you should have lived like that or like this; you think of your children and grandchildren. There are so many worries, problems. Sankarasays, in the end, *parebrahmani kopi-na-sakttah*- nobody has time to think of *Param Brahma*. The whole life is spent in doing this or that, not on the one thing that matters.

Again Sankara says in another verse:

*Kaatekaantakasteputrah,*
*samsaaroyamateevavichitrah*
*Kasyatvamvaakutaaayaatahtat*
*vamchintayatadihabhraatah*

These statements of Sankara are so simple and yet so profound! He says here: in the beginning you think of yourself and your father and mother. You get married to a woman one day, she comes from nowhere, and suddenly she becomes very important in your life. You say I can't live without her. Your father and mother are not important anymore. Same thing is the wife's attitude towards the husband. He becomes very important. Sankara asks this question, who is this? She was somewhere and you were somewhere else. Then suddenly she becomes all-important to you; you begin to ignore everybody else. *Kaatekaanta? Kasteputrah* - one day you have a child. The moment you



